## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్రం
- 9న ముగియనున్న సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి వచ్చే నెల 9 వరకు జరుగనున్నాయి. ఈ నెల 31న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాత్కాలిక లేదా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మేలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఫలితాల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 17వ లోక్‌సభ గడువు జూన్ 16న ముగియనున్నది. సార్వత్రిక ఎన్నికల ముందు పార్లమెంట్ సమావేశం కావడం ఇదే చివరిసారి. 2019లో మార్చి 10న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించారు.

## పరిశుభ్ర నగరంగా ఇండోర్

### తొమ్మిదో స్థానంలో హైదరాబాద్

న్యూఢిల్లీ, జనవరి 11: దేశంలో అత్యంత పరిశుభ్ర నగరంగా ఇండోర్ వరుసగా ఏడోసారి టాప్ ప్లేస్‌ను దక్కించుకుంది. ఇండోర్‌తోపాటు సూరత్ కూడా సంయుక్తంగా తొలిస్థానంలో నిలిచింది. నవీ ముంబై మూడో స్థానాన్ని నిలబెట్టుకుంది. హైదరాబాద్‌కు తొమ్మిదో స్థానం దక్కింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గురువారం 2023 ఏడాదికిగానూ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రకటించింది. 'బెస్ట్ పెర్ఫార్మింగ్ స్టేట్స్' క్యాటగిరీలో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

## ఉద్యోగాలు అమ్ముకున్న కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే

### ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడి

న్యూఢిల్లీ: కర్ణాటకలోని కోలార్-చిక్కబళ్లాపుర డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్ (కేఓఎంయూఎల్)లో ఉద్యోగ నియామకాల్లో కుంభకోణం జరిగిందని ఈడీ ఆరోపించింది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజెగౌడ ఈ కుంభకోణంలో ప్రత్యక్ష పాత్ర పోషించారని తెలిపింది. కొందరు రాజకీయ నేతలు సూచించిన 30 మంది అభ్యర్థులకు ఆయన నేతృత్వంలోని కమిటీ ఉద్యోగాలు ఇచ్చిందని వెల్లడించింది. లంచాలు తీసుకుని, ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తిగా మాయ చేసి, వీరికి ఉద్యోగాలు ఇచ్చారని చెప్పింది. ఒక్కొక్క ఉద్యోగానికి రూ.20-30 లక్షలు వసూలు చేసినట్టు వెల్లడించింది.

# కొత్త ఏడాదిలోనూ కోతలే

## భారీగా టెక్ ఉద్యోగుల తొలగింపులు

### వందల మందిపై గూగుల్, అమెజాన్ వేటు

### 1,500 మందిని తొలగించనున్న ఫ్లిప్‌కార్ట్!

### 1800 మందికి యూనిటీ సాఫ్ట్‌వేర్ ఉద్వాసన

న్యూఢిల్లీ, జనవరి 11: నూతన సంవత్సరంలోనూ ఉద్యోగాల ఊచకోత కొనసాగుతున్నది. దిగ్గజ కంపెనీల నుంచి స్టార్టప్‌ల వరకూ అన్ని టెక్ కంపెనీలు ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. తాజాగా గూగుల్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం సంస్థలు వందల మంది ఉద్యోగులపై వేటు వేశాయి. ప్రపంచ ఆర్థిక మందగమన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వందలాది కంపెనీలు లేఆఫ్‌లను ప్రకటిస్తున్నాయి. ఖర్చులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. రాబోయే నెలల్లో మరిన్ని 'లేఆఫ్'లు ఉంటాయని మెటా సీఈవో జుకర్‌బర్గ్ చెబుతున్నారు.

**గూగుల్:** అమెరికా టెక్నాలజీ న్యూస్ వెబ్‌సైట్ 'ద వెర్జ్' కథనం ప్రకారం, గూగుల్‌లో హార్డ్‌వేర్, ఇంజినీరింగ్, అసిస్టెంట్ టీమ్స్‌లలో తాజాగా కొన్ని వందల మందిని తొలగించడానికి కంపెనీ సిద్ధమైంది. 'ఉద్యోగాల తొలగింపు గూగుల్‌లో సర్వసాధారణం' అని కంపెనీ అధికార ప్రతినిధి కోర్ట్నీ మెన్‌సినీ వ్యాఖ్యానించారు. సంస్థకు చెందిన ఫిట్‌బిట్, నెస్ట్, పిక్సెల్‌లలో సిబ్బందిని పెద్ద సంఖ్యలో తొలగించటం టెక్ రంగంలో సంచలనం రేపింది. ఏఆర్ రియాలిటీ విభాగంలో వందలాది మందికి పింక్ స్లిప్‌లు అందాయి.

**ఫ్లిప్‌కార్ట్:** ప్రముఖ ఈ కామర్స్ కంపెనీగా ఎదిగిన ఫ్లిప్‌కార్ట్‌లో దాదాపు 22వేల మంది




వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. దీంట్లో 5 నుంచి 7 శాతం (1500మంది) వరకు లేఆఫ్‌లు ఉండొచ్చునని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. అంతేగాక ఫ్లిప్‌కార్ట్ ఏడాదిపాటు నియామకాల్ని ఆపేయనున్నదని 'ఎకనమిక్స్ టైమ్స్' కథనం పేర్కొన్నది.

**యూనిటీ సాఫ్ట్‌వేర్:** గేమ్ డెవలపర్స్‌కు టూల్స్‌ను అందించే 'యూనిటీ సాఫ్ట్‌వేర్', ప్రపంచవ్యాప్తంగా తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిలో 25 శాతం (1800 మంది) ఉద్యోగుల్ని తొలగించేందుకు ప్రణాళికను రూపొందించింది.

### అమ్మోజాన్..!

కంపెనీ అంతర్గత నోట్ ప్రకారం, అమెజాన్ ఎంజీఎం, అమెజాన్ ప్రైమ్ వీడియోలో పనిచేస్తున్న వందలమంది అమెరికన్లు ఈ వారంలో ఉద్యోగాలు కోల్పోయారు. మరికొద్ది రోజుల్లో మిగతా దేశాల్లోనూ లే ఆఫ్‌లు ఉంటాయని తెలిసింది. దక్షిణ కొరియాలో కార్యకలాపాల్ని పూర్తిగా ఆపేస్తున్నది. అమెరికాలో వీడియో లైవ్ స్ట్రీమింగ్ సేవలు అందించే (సబ్సిడరీ కంపెనీ) 'ట్విచ్'లో 500 మందిని తొలగించారు. గత ఏడాది 27 వేలమంది ఉద్యోగుల్ని అమెజాన్ తొలగించింది. మరోవైపు హాలీవుడ్ సినిమాలు, స్టూడియోలు కొనుగోలు చేయడానికి వేల కోట్ల రూపాయల్ని ఖర్చు చేస్తున్నది.

**పేటీఎం:** ఆంగ్ల దినపత్రిక కథనం ప్రకారం, ఇటీవల కాలంలో పేటీఎం సుమారుగా 1000 మంది ఉద్యోగుల్ని తొలగించింది. కొన్ని విభాగాల్లో సేవల్ని నిలిపివేస్తూ10 శాతం మంది సిబ్బందిపై వేటు వేసింది. ముందు ముందు వ్యయ నియంత్రణ చర్యలు ఉండబోతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఉద్యోగుల వేతనాల ఖర్చును 10-15 శాతం వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## విమానం డోర్ తెరచి దూకేసిన ప్రయాణికుడు

### టొరంటో విమానాశ్రయంలో ఘటన

టొరంటో, జనవరి 11: కెనడాలో బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న విమానంలో ఒక ప్రయాణికుడి చర్య అందరినీ షాక్‌కు గురి చేసింది. టొరంటో నుంచి దుబాయ్ వెళ్లనున్న విమానంలో హఠాత్తుగా తలుపును తెరచిన ఒక ప్రయాణికుడు అక్కడి నుంచి కిందకు దూకాడు. ఈ ఘటన టొరంటోలోని పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ కెనడాకు చెందిన ఏసీ056 విమానంలో సోమవారం చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విమానం లోపలికి వచ్చిన ఆ ప్రయాణికుడు తన సీటువైపు వెళ్లకుండా అవతలి వైపున ఉన్న కేబిన్ డోర్ తెరచి కిందకు దూకేశాడు. సుమారు 20 అడుగుల పైనుంచి దూకడంతో గాయపడ్డాడు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ ప్రయాణికుడిని దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో విమానం ఆరుగంటలు ఆలస్యంగా బయలుదేరింది.

## జమిలి ఎన్నికలకు అంగీకరించబోం: మమత బెనర్జీ

న్యూఢిల్లీ: లోక్‌సభ, అన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు ఒకేసారి జరగాలనే ప్రతిపాదనను అంగీకరించేది లేదని పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతాబెనర్జీ గురువారం తేల్చిచెప్పారు. భారత రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి ఈ విధానం వ్యతిరేకమని స్పష్టంచేశారు. ఈ మేరకు ఆమె మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీకి ఓ లేఖ రాశారు.

# కులం, మతం పేరుతో కర్ణాటకను పాడుచేయొద్దు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐటీ దిగ్గజం మోహన్‌దాస్ సూచన



బెంగళూరు, జనవరి 11: కుల, మత ప్రాధాన్యాలతో కర్ణాటక భవిష్యత్తును పాడుచేయొద్దని ఐటీ పరిశ్రమ ప్రముఖుడు టీవీ మోహన్‌దాస్ పాయ్ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారును కోరారు. ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆయన 'ఎక్స్'లో గురువారం సందేశాన్ని పోస్ట్ చేశారు. 'తప్పుడు ప్రాధాన్యతలపై సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి. దయచేసి రాష్ట్ర భవిష్యత్తును పాడుచేయొద్దు' అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతూ సందేశాన్ని పోస్ట్ చేశారు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి జి పరమేశ్వర.. తదితరులకు తన పోస్ట్‌ను ఆయన ట్యాగ్ చేశారు. దేశంలో ఇతర రాష్ట్రాలు ఆర్థికంగా, సామాజికంగా దూసుకెళ్తుంటే, కన్నడనాట పాఠశాలల్లో హిజాబ్‌కు తిరిగి అనుమతి ఇవ్వటం, కన్నడ భాషల్లోనే బోర్డులు, నామ ఫలకాలు ఉండాలని ఆర్డినెన్స్ తేవటం.. మొదలైనవి కాంగ్రెస్ సర్కార్ చేపట్టడాన్ని పలువురు మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు తప్పుబడుతున్నారు. సామాజిక మాధ్యమంలో వారు పెడుతున్న పోస్టులు వైరల్ అవుతున్నాయి.

## యాపిల్‌ని మించిన మైక్రోసాఫ్ట్

వాషింగ్టన్: ఐఫోన్ తయారీదారు యాపిల్ కంపెనీకి 2024 ప్రారంభంలోనే చేదు వార్త ఎదురైంది. డిమాండ్ పరమైన ఇబ్బందులు పెరుగుతుండటంతో మైక్రోసాఫ్ట్ కంపెనీ కన్నా వెనుకబడింది. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న మైక్రోసాఫ్ట్ షేర్ల విలువ గురువారం 1.5% పెరిగింది. దీంతో మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ గురువారం 2.888 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. యాపిల్ కంపెనీ మార్కెట్ విలువ 2.887 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. మైక్రోసాఫ్ట్ కన్నా తక్కువ విలువకు యాపిల్ విలువ పతనమవడం 2021 తర్వాత ఇదే మొదటిసారి. ఐఫోన్ అమ్మకాలు బలహీనపడటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

## పంచాయతీ స్థాయిలో వాతావరణ హెచ్చరికలు

### చిన్న రైతులకు మేలు చేసేలా ఐఎండీ సేవల విస్తరణ

న్యూఢిల్లీ, జనవరి 11: చిన్న రైతులకు మేలు చేసేలా, వాతావరణం వల్ల కలిగే నష్టాలు తగ్గించేలా ఈ నెల 15 నుంచి భారత వాతావరణ విభాగం(ఐఎమ్‌డీ) తన సేవలను మరింత విస్తరించనుంది. వాతావరణ సమాచారాన్ని బ్లాక్ స్థాయి నుంచి గ్రామ పంచాయతీ స్థాయికి విస్తరిస్తున్నట్టు ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర గురువారం తెలిపారు. 'పంచాయతీ రుతు సేవ' ద్వారా ప్రతి గ్రామంలో కనీసం అయిదుగురు రైతులతో అనుసంధానమయ్యేలా ఈ సేవలను అందించనున్నారు. ఈ సేవల్లో అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ, గాలి వేగం, తీవ్ర వాతావరణ హెచ్చరికల సమాచారం అందిస్తారు. ఇంగ్లిష్, హిందీతో పాటు 12 భారతీయ భాషల్లో ఈ సమాచారం అందుబాటులో ఉంటుంది. దేశంలో ఎవరైనా ఎక్కడైనా నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించిన వాతావరణ సమాచారాన్ని తమ మొబైల్



ఫోన్‌లో చూసుకోవచ్చు. వాతావరణ సూచనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటే సన్నకారు రైతులు రూ.12,500 వరకు లాభం పొందవచ్చని చెప్పారు. వ్యవసాయం, ఎనర్జీ, విపత్తు నిర్వహణ, విద్యుత్తు, ఆరోగ్యం, నీళ్లు తదితర రంగాలకు వాతావరణ సేవలు విస్తరిస్తామన్నారు. వాతావరణ సూచనల ద్వారా విద్యుత్తు, ఆరోగ్యం, రవాణా రంగాల్లో నష్టాలను తగ్గించవచ్చన్నారు. 'నిర్మాణ పనులకు, పెండ్లిండ్లకు ప్రజలు వాతావరణ సమాచారం ఉపయోగించుకోవాలని మేము కోరుకుంటున్నాం' అని మహాపాత్ర అన్నారు.

## మోసపూరిత కాల్స్ పట్ల జాగ్రత్త

### యూజర్లను హెచ్చరించిన కేంద్రం

న్యూఢిల్లీ: గుర్తు తెలియని నంబర్లతో వచ్చే మోసపూరిత ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని దేశ పౌరులను కేంద్రం హెచ్చరించింది. మోసగాళ్లు టెలికం సర్వీస్ ప్రతినిధులుగా, సాంకేతిక సిబ్బందిగా పరిచయం చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. సిమ్ కార్డు లేదా నెట్‌వర్క్‌లో సమస్య ఉందని, దీని పరిష్కరిస్తామని మాయమాటలు చెప్తారని పేర్కొన్నది. *401# నొక్కి తర్వాత గుర్తు తెలియని నంబర్ చెప్పి, దానికి డయల్ చేయాలని కోరుతారని వివరించింది. అలా చేస్తే ఫోన్‌లో 'అన్ కండీషనల్ కాల్ ఫార్వర్డింగ్' యాక్టివేట్ అవుతుందని, దీంతో ఆ గుర్తు తెలియని వ్యక్తి నియంత్రణలోకి మన ఫోన్ వెళ్లిపోతుందని తెలిపింది.



## సామాన్యురాలితో బ్రూనై యువరాజు పెండ్లి

బందర్ సేరి బెగవాన్, జనవరి 11: దక్షిణాసియాలోని బ్రూనై దేశానికి చెందిన యువరాజు అబ్దుల్ మతీన్ ఒక సామాన్యురాలిని మనువాడబోతున్నారు. పదిరోజులపాటు అత్యంత వైభవంగా ఈ వేడుకలు జరుగనున్నాయి. 32 ఏళ్ల యువరాజు 29 ఏండ్ల యాంగ్ ములియా అనీషా రోస్నాను ఇస్లామిక్ సంప్రదాయంలో వివాహం చేసుకోనున్నారు. చమురు సంపన్న సామ్రాజ్యంలో తూలతూగుతూ ఒకప్పుడు ఈ గ్రహంలోనే అత్యంత ధనవంతుడు, ప్రపంచంలోనే ఎక్కువ కాలం పాలించిన సుల్తాన్ హసన్నల్ బొల్కియాకు మతీన్ 10వ సంతానం. పెండ్లి కూతురు ఆయన సలహాదారుల్లోని ఒకరి మనుమరాలు. 1788 గదులున్న ప్యాలెస్‌లో ఆదివారం జరిగే ఊరేగింపు వేడుకతో వివాహం ముగింపు దశకు చేరుకుంటుంది.

## పేదలకు విరాళంగా రూ.200 కోట్లు

సిడ్నీ: ఆస్ట్రేలియా-జర్మన్ వారసురాలు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తన అమ్మమ్మ నుంచి వారసత్వంగా సంక్రమించిన 24.7 మిలియన్ డాలర్ల (సుమారు రూ.200 కోట్లు) సంపదను పేదలకు పంచాలని నిర్ణయించుకున్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారికి సమానంగా సంపదను పంచడంలో ప్రభుత్వం విఫలమైనందున తానీ నిర్ణయం తీసుకున్నట్టు 31 ఏండ్ల మార్లెనె ఏంగెల్ హార్న్ ప్రకటించారు.

## వాంతొచ్చేలా 'వందేభారత్' ఆహారం!

### పాచిపోయిన ఫుడ్ ఫొటోలు షేర్ చేసిన ప్రయాణికుడు

న్యూఢిల్లీ, జనవరి 11: వందే భారత్ రైల్లో సరఫరా చేసిన ఆహారం పాచిపోయిందని చెప్తూ ప్రయాణికులు తిరస్కరించారు. ఎక్స్ వేదికగా రైల్వే ఆహార సేవలపై ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకొంటామని ఐఆర్‌సీటీసీ వివరణ ఇచ్చింది. ఆకాశ్ కేసరి అనే ప్రయాణికుడు తనకు రైల్లో సరఫరా చేసిన ఆహారం పాచిపోయిందని చెప్తూ వాటి ఫోటోలను ఎక్స్‌లో పంచుకున్నారు. తాను నిరాశకు గురయ్యాయని, తాను చెల్లించిన డబ్బులను వెనక్కివ్వాలని కోరారు. 'హాయ్ సర్.. నేను 22416లో ప్రయాణిస్తున్నా. నాకు సరఫరా చేసిన ఫుడ్ పాచిపోయి వాసన వస్తున్నది. ఈ అమ్మకందారు వందే భారత్ బ్రాండ్ పేరును చెడగొడుతున్నాడు' అని ఆయన ట్వీట్ చేశారు. దీనిపై ఫిర్యాదు నమోదు చేసుకొన్నామని రైల్వే సేవ తెలిపింది. ఐఆర్‌సీటీసీ క్షమాపణ చెప్పింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఆహార సరఫరాదారుకు తగిన జరిమానా విధిస్తామంది. పర్యవేక్షణను మరింత దృఢతరం చేస్తామంది. ఈ ఘటనపై ఓ నెటిజన్ స్పందిస్తూ రాజధాని రైల్లోనూ తనకు ఇలాగే జరిగిందని తెలిపారు.

# సరయు ఒడ్డున 'రామాయణ వనం'

అయోధ్య, జనవరి 11: అయోధ్యకు వచ్చే భక్తులు రామాయణ కాలం నాటి సంఘటనలను చూసే ఉద్దేశంతో అయోధ్యలో రామాయణ ఆధ్యాత్మిక వనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అయోధ్య మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, రాముడు వనవాసం చేసిన 14 ఏండ్ల కాలాన్ని గుర్తుచేసేలా సరయు నది ఒడ్డున ఈ వనాన్ని తీర్చిదిద్దినట్టు అధికారులు తెలిపారు.

### అయోధ్యకు ఎల్‌కే అద్వానీ

బీజేపీ కురువృద్ధుడు ఎల్కే అద్వానీ రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వస్తున్నారని వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్ తెలిపారు. అయితే, మరో నేత మురళీ మనోహర్ జోషి హాజరు అవుతారా? లేదా? అన్న దానిపై పూర్తి సమాచారం లేదని వెల్లడించారు.

### ప్రపంచవ్యాప్తంగా మార్మోగనున్న రామనామం

అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలను ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయి నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద లైవ్ ప్రసారం కానుండగా, కాలిఫోర్నియా, వాషింగ్టన్, న్యూయార్క్, చికాగో, యూరోపియన్ దేశాలు, కెనడా నగరాల్లో ర్యాలీలు, లైవ్ షోలు ప్రసారం చేసే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

### 22న అయోధ్యకు 110 విమానాలు

ఈ నెల 22న అయోధ్య గగనతలంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడనున్నది. అయోధ్య



బెంగళూరులోని ఓ మాల్‌లో రామాలయ నిర్మాణ ఇతివృత్తంతో తీర్చిదిద్దిన భారీ ముగ్గు

ఎయిర్‌పోర్టుకు భారీస్థాయిలో విమానాలు రానుండటంతో ఈ ప్రాంతమంతా బిజీగా మారనున్నది. వీవీఐపీలు, వీఐపీల రాక కోసం అయోధ్య ఎయిర్‌పోర్టుకు 200 వరకు అభ్యర్థనలు రాగా, 110 విమానాలకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నట్టు అధికారులు వెల్లడించారు.

### వారణాసి ఘాట్లలో ఉచిత బోటు ప్రయాణం

రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా వారణాసి బోటు నిర్వాహకులు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. వారణాసిలోని మొత్తం 84 గంగా ఘాట్లలో ఈ నెల 22న ఉచిత ప్రయాణం కల్పించనున్నట్టు ప్రకటించారు. గంగా నిషద్ రాజ్ సేవా ట్రస్ట్ సెక్రటరీ శంభు సాహ్ని మాట్లాడుతూ.. నిషద్ వర్గంతో శ్రీరాముడికి గొప్ప సంబంధం ఉన్నదని తెలిపారు. శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతమ్మ తల్లి అడవి గుండా ప్రయాణించే సందర్భంలో నిషద రాజు వారిని ఉచితంగా నది దాటించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరగనున్నందున ఆ రోజు తాము కూడా ఉచితంగా బోటు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

### 1,111 శంఖాలతో జయధ్వానాలు

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా 1,111 శంఖాలతో జయధ్వానం చేయనున్నారు. ఈ మేరకు యూపీ సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ స్థాయిలో ఒకేసారి శంఖారావాలు చేసిన సందర్భం గతంలో ఎన్నడూ లేదని అధికారులు తెలిపారు.

# ధార్మికమా? రాజకీయమా?

- అయోధ్య మహోత్సవానికి మేం హాజరుకాబోం
- ఆలయ నిర్మాణం పూర్తికాకుండానే విగ్రహ ప్రతిష్ఠా?
- రామాలయ ప్రారంభంపై శంకరాచార్యుల ఆగ్రహం

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): అయోధ్య రామాలయం ప్రారంభోత్సవంపై ప్రతిపక్ష పార్టీలతోపాటు శంకరాచార్య పీఠాధిపతులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బీజేపీ ఓ రాజకీయ ప్రచారంగా మార్చిందని ధ్వజమెత్తారు. సనాతన ధర్మం, శాస్త్ర విధులు, ఆచారాలకు అనుగుణంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగడం లేదని మండిపడ్డారు. జనవరి 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ వేడుకకు తామెవ్వరం హాజరు కాబోమని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఉత్తరాఖండ్‌లోని జ్యోతీష్మఠ్ పీఠాధిపతి శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి, గుజరాత్‌లోని ద్వారకా పీఠాధిపతి శంకరాచార్య శ్రీ స్వామి సదానంద సరస్వతి, ఒడిశాలోని పూరీ పీఠాధిపతి శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి వెల్లడించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.*

### తీర్థ స్థలాలు.. భోగస్థలాలయ్యాయి

*ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానించారు. అయినా వెళ్లబోను. ఇది దైవ కార్యంగా లేదు. రాజకీయ ప్రచారంలాగా కనిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తున్నట్టు అర్థమవుతున్నది. శ్రీరాముని విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరిస్తూ ఉంటే, పీఠాధిపతులమైన మేము బయట ఉండి చప్పట్లు కొట్టాలా? అభివృద్ధి పేరిట పుణ్యక్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా మార్చుతున్నారు. తీర్థ స్థలాలు భోగస్థలాలుగా మారుతున్నాయి.*



*-పూరీ పీఠాధిపతి శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి*

### రాజకీయ నేతల కొత్త అవతారం

*భారత్‌లో రాజకీయ నేతలు మఠాధిపతుల అవతారమెత్తుతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఇదంతా చేస్తున్నారు. అయోధ్య వేడుకకు వెళ్లబోం. అయితే, ఈ చర్యతో మేం ప్రధాని మోదీకి వ్యతిరేకం అని అనుకోవద్దు. అయోధ్య వేడుకలో శాస్త్ర విధి, ఆచారాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. రామాలయం నిర్మాణం పూర్తికాకుండానే పూజాదికాలు జరుగుతున్నాయి. పూర్తికాని దేవాలయంలో ప్రాణ ప్రతిష్ఠ చేయడాన్ని ఎలా ఆమోదిస్తాం??*



*- జ్యోతీష్మఠ్ పీఠాధిపతి శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి*

- మేడలో నుంచి మోనో రైలు



*అపార్ట్‌మెంట్ నుంచి రైలు దూసుకొస్తున్నదేంటి అనుకుంటున్నారా? చైనాలోని చాంగ్‌కింగ్‌లోనిది ఈ చిత్రం. కేవలం 31వేల చదరపు మైళ్లలో 4.9 కోట్ల మంది నివసించే ఈ నగరంలో స్థలాభావం కారణంగా చైనా ఇలా 19 అంతస్థుల భవనం గుండా రైల్వేలైన్ నిర్మించింది.*

## శక్తివంతమైన పాస్‌పోర్టుల్లో మనది 80వ స్థానం

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రపంచంలోని శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ 80వ స్థానంలో నిలిచింది. ఉజ్బెకిస్థాన్‌తో కలిసి ఈ ర్యాంకును పంచుకుంది. భారతీయులు 62 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. హెన్లీ పాస్‌పోర్ట్ సంస్థ విడుదల చేసిన 2024 సూచికలో ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, సింగపూర్, స్పెయిన్ సంయుక్తంగా మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నాయి. ఈ దేశాల పౌరులు 194 దేశాల్లో వీసా లేకుండా ప్రయాణించొచ్చు. ఫిన్‌లాండ్, స్వీడన్, దక్షిణ కొరియా సంయుక్తంగా రెండో ర్యాంకు దక్కించుకున్నాయి. ఆస్ట్రియా, డెన్మార్క్, ఐర్లాండ్, నెదర్లాండ్ మూడో ర్యాంకును పొందాయి.

# స్మార్ట్‌ఫోన్లకు ఇక కాలం చెల్లు?!

- *పాకెట్‌లో ఇట్టే ఇమిడిపోయే 'ర్యాబిట్ ఆర్1'*
- *ఫోన్, కెమెరా, మ్యూజిక్ సిస్టమ్, ట్యాబ్ ఇలా అన్ని ఫీచర్లు, యాప్ సేవలు ఒకేదగ్గర*
- *సరికొత్త ఏఐ డివైజ్‌ను తీసుకొచ్చిన 'ర్యాబిట్'*
- *ఇప్పటికే, పోటీలో దూసుకుపోతున్న ఏఐపిన్*





*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ల్యాండ్‌లైన్ ఫోన్, వాచ్, క్యాలిక్యులేటర్, కెమెరా, ఎఫ్ఎం రేడియో, టీవీలకు ప్రత్యామ్నాయంగా మారిన స్మార్ట్‌ఫోన్‌కు కూడా ఇక కాలం చెల్లిపోనున్నదా? స్మార్ట్‌ఫోన్‌కు చెక్ పెట్టేలా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో పనిచేసే అధునాతన డివైజ్‌లను టెక్ కంపెనీలు తీసుకొస్తుండటమే దీనికి కారణం. ఇప్పటికే, రేబ్యాన్ ప్రత్యేక గ్లాసెస్, హ్యూమానే 'ఏఐ పిన్' స్మార్ట్‌ఫోన్‌కు ప్రత్యామ్నాయ సేవలను అందిస్తుండగా ఇప్పుడు అమెరికా స్టార్టప్ కంపెనీ ర్యాబిట్ మరో సరికొత్త ఏఐ డివైజ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ర్యాబిట్ ఆర్1'గా పిలుస్తున్న ఈ డివైజ్ ఎంచక్కా పాకెట్‌లో ఇమిడిపోతుంది. విడుదల రోజే ఈ డివైజ్‌ను 10 వేల మంది బుకింగ్ చేసుకొన్నారంటే దీని క్రేజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు.*

### ఎలా పనిచేస్తుంది?

*ఏదైనా ఆహారం ఆర్డర్ ఇవ్వాలంటే ఫుడ్ యాప్స్ ఫోన్‌లో ఉండాలి. ఎక్కడికైనా వెళ్లాలంటే క్యాబ్ బుకింగ్స్‌కి యాప్ తప్పనిసరి. బ్యాంకింగ్, గేమ్స్, ఎంటర్టైన్మెంట్ ఇలా ఏది కావాలన్నా ఫోన్‌లో యాప్స్ తప్పనిసరి. అయితే, ఇవేమీ అవసరం లేకుండా వాయిస్ అసిస్టెంట్‌తో అవసరమేంటో చెప్పగానే.. అడిగిన సేవలు క్షణాల్లో లభిస్తే ఎంత బాగుంటుంది. సరిగ్గా ఇలాంటి అవసరాలను తీర్చడానికి తీసుకొచ్చిందే.. ర్యాబిట్ 'ఆర్1'. ఈ గ్యాడ్జెట్ 'లార్జ్ యాక్షన్ మాడల్' అనే ఏఐ సిస్టమ్ ఆధారంగా ర్యాబిట్ ఓఎస్ అనే ఆపరేటింగ్ సిస్టమ్‌పై పనిచేస్తుంది. ఫోన్‌లో ఉన్నట్టే డిస్‌ప్లే స్క్రీన్, కెమెరా, మైక్రోఫోన్ దీంట్లో ఉన్నాయి. ఈ డివైజ్‌తో కాల్స్ చేయొచ్చు. మెసేజీలు పంపొచ్చు. ఫొటోలు, వీడియోలు తీయొచ్చు. బ్రౌజింగ్ కూడా చేయొచ్చు. లాంగ్వేజ్ ట్రాన్స్‌లేటర్, మ్యూజిక్ సిస్టమ్, ట్యాబ్ పనితీరు, వర్చువల్ అసిస్టెంట్ ఇలా ఒక్కటేమిటీ స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న దానికంటే ఇంకా ఎక్కువే ఫీచర్లు ఇందులో ఉన్నాయని చెప్పొచ్చు. ఈ ఫీచర్లను వాడాలంటే ప్రత్యేకంగా యాప్స్ కూడా అవసరం లేదు. లోకల్ ల్యాంగ్వేజీలో కమాండ్స్ ఇస్తే సరిపోతుంది. అవసరమైన పనులను ఈ డివైజ్ చేసిపెడుతుంది. 2.3 గిగాహెర్జ్ మీడియా టెక్ హీలియో పీ35 ప్రాసెసర్, 4 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ, సిమ్ స్లాట్, యూఎస్‌బీ-సీ కనెక్టివిటీ, ఆల్‌డే బ్యాటరీ లైఫ్ వంటి ఫీచర్లతో ఈ డివైజ్‌ను ఇటీవలే ఆవిష్కరించారు. ధర 199 డాలర్లుగా (రూ. 16,529) నిర్ణయించారు. ఈ డివైజ్ సహాయంతో ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను మనం ఉన్నచోట నుంచే కంట్రోల్ కూడా చేయొచ్చు.*



### 'ఏఐ పిన్'కు పోటీగా

*స్మార్ట్‌ఫోన్‌కు ప్రత్యామ్నాయంగా వాడుకొనేలా అమెరికాకు చెందిన స్టార్టప్ కంపెనీ హ్యూమానే 'ఏఐ పిన్' డివైజ్‌ను గత నవంబర్‌లో తీసుకొచ్చింది. 'ర్యాబిట్ ఆర్1'లో ఉన్న అన్ని ఫీచర్లు 'ఏఐ పిన్'లోనూ ఉన్నప్పటికీ డిస్‌ప్లే స్క్రీన్ మాత్రం 'ఏఐ పిన్'లో లేదు. అలాగే ధర విషయంలోనూ రెండు గ్యాడ్జెట్ల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తున్నది. 'ర్యాబిట్ ఆర్1' డివైజ్ 199 డాలర్లకు లభిస్తుండగా.. 'ఏఐ పిన్' ధర 699 డాలర్లుగా ఉన్నది. దీంతో కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ, 'ఏఐ పిన్'కు 'ర్యాబిట్ ఆర్1' గట్టిపోటీనిచ్చే అవకాశమున్నట్టు టెక్ నిపుణులు చెబుతున్నారు.*